క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో సింగరేణి కార్మికుడి మృతి

భూపాలపల్లి అర్బన్: అనుమానాస్పద స్థితిలో సింగరేణి కార్మికుడు మృతి చెందిన ఘటన బుధవారం భూపాలపల్లి పట్టణంలోని కృష్ణ కాలనీ సమీపంలో చోటుచేసుకుంది. స్థానిక సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణకాలనీలో నివాసముంటున్న మూడు కృష్ణ (50) ఏరియాలోని ఓపెన్‌కాస్ట్–3 ప్రాజెక్ట్‌లో సింగరేణి కార్మికుడిగా విధులు నిర్వర్తిస్తున్నట్లు తెలిపారు. కృష్ణ ఉదయం ఇంటి నుంచి బయటికి వెళ్లి 9గంటల సమయంలో కృష్ణకాలనీ సమీపంలోని అడవిలో చనిపోయి ఉన్నట్లు గమనించిన కాలనీ వాసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు తెలిపారు. దీంతో మృతుడి కుమారుడు శ్రీకాంత్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బాలుడిపై అట్రాసిటీ కేసు నమోదు

చిట్యాల: మండలంలోని ఒడితల గ్రామానికి చెందిన ఓ మహిళపై అదే గ్రామానికి చెందిన ఓ బాలుడు కత్తితో దాడి చేయగా అతనిపై హత్యాయత్నం, అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని ఒడితల గ్రామానికి చెందిన ఓ బాలుడు అదే గ్రామానికి చెందిన మహిళ మూలంగానే తన తల్లిదండ్రులకు ప్రతి రోజు గొడవలు జరుగుతున్నాయనే నేపంతో ఆ మహిళపై మంగళవారం రాత్రి కత్తితో దాడికి పాల్పడినట్లు ఎస్సై తెలిపారు. దీంతో బాధిత మహిళ బుధవారం ఫిర్యాదు చేయగా బాలుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మత్స్యశాఖ సహకార సంఘం ఎన్నిక

- చైర్మన్ పీఠం కాంగ్రెస్ కైవసం

గణపురం: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని అతిపెద్ద మత్స్యశాఖ పారిశ్రామిక సంఘమైన గణపురసముద్రం చెరువు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం డైరెక్టర్ల ఎన్నిక ముగిసింది. మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం నిర్వహించిన మత్స్యశాఖ ఎన్నికల్లో 9 మంది డైరెక్టర్లకు గాను 12 మంది అభ్యర్థులు ఎన్నికలో పాల్గొన్నారు. ఉదయం 8 గంటలకు నుంచి మధ్యాహ్నం 1గంట వరకు రహస్య బ్యాలెట్ పద్ధతిన జిల్లా సహకార శాఖ ఎన్నికల అధికారి శైలజ ఓటింగ్ నిర్వహించారు. 774 మంది సభ్యులకు గాను 664 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఆమె తెలిపారు. ఇందులో అధికంగా ఓట్లు వచ్చిన సభ్యులు గుర్ల రాజుకుమార్, మునిగాల రమేష్, కొంతం గణపతి, బండి శ్రీనివాస్, దార్ల రఘు, పల్లెబోయిన కృష్ణం రాజు, మల్లెబోయిన రాజు, మల్లెబోయిన ఉప్పలయ్య, గుండ్ల రాజు డైరెక్టర్లుగా ఎన్నికైనట్లు తెలియజేశారు. ఈ ఎన్నికల కాంగ్రెస్ పార్టీ బలపరిచిన 8 మంది అభ్యర్థుల గెలుపొందడంతో వారికే చైర్మన్ పీఠం దక్కే అవకాశం ఉంది.

హామీలు అమలు చేయకపోతే ఆందోళన

ములుగు రూరల్: ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలో బుధవారం నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతు రుణమాఫీ చేసి కొత్త రుణాలను అందించాలన్నారు. జిల్లాలో ఎక్కువగా ఏజెన్సీ ప్రాంతంగా ఉండడంతో రైతులకు హక్కు పత్రాలు, పట్టాదారు పాస్‌పుస్తకాలు లేకుండా పోయాయన్నారు. దీంతో రైతులు పూర్తిస్థాయి పట్టాలు లేక ప్రభుత్వం అందించే సహాయం పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గోదావరి జలాలను జిల్లా రైతులకు సాగునీటి నిమిత్తం అందించాలని కోరారు.

విద్యార్థులకు క్రీడలు

వాజేడు: బడిబాట చివరి రోజు కార్యక్రమంలో భాగంగా బుధవారం విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించారు. మండల పరిధిలోని నాగారం గ్రామం ఎంపీపీఎస్‌లో ప్రధానోపాధ్యాయుడు బాలాజీ విద్యార్థులకు కబడ్డీ పోటీలను నిర్వహించారు. బడి బాటలో భాగంగా 15 మంది విద్యార్థులను బడిలో చేర్పించినట్లు తెలిపారు. ఆటల పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

కోడిగుడ్లు పగులగొట్టిన దుండగులను శిక్షించాలి

ఏటూరునాగారం: కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెం గ్రామంలోని 2వ అంగన్‌వాడీ కేంద్రం, 5వ అంగన్‌వాడీ కేంద్రంలో 700 కోడిగుడ్లను ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఏటూరునాగారం ఐసీడీఎస్ సీడీపీఓ హేమలత అన్నారు. సంక్షేమ అధికారి స్వర్ణలత లెనినా ఆదేశాల మేరకు బుధవారం సాక్షిలో ప్రచురితమైన వార్త కథనానికి స్పందించి వివరణ ఇచ్చారు. బుట్టాయిగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను పగులగొట్టి అందులోకి దూరి పిల్లలు, బాలింతలు, గర్భిణులకు ఇవ్వాల్సిన కోడిగుడ్లను ధ్వంసం చేయడం బాధాకరమన్నారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

కాటారం: వర్షాకాలంలో ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ పంతకాని సమ్మయ్య తెలిపారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం భారీ వర్షాలు, వరదలు, సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలపై అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. మండలంలో పలు గ్రామాలు మానేరు, గోదావరికి సమీపంలో ఉన్నందున వాగులు ఉప్పొంగి ప్రమాదాలు సంభవించడం, లోతట్టు ప్రాంతాలు వరద నీటితో మునిగిపోవడం లాంటివి జరిగే అవకాశం ఉంటుందన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు సంక్రమించకుండా వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమాలు, వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు పకడ్బందీగా చేపట్టాలని ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ బాబు, ఎంపీఓ ఉపేంద్రయ్య, నయాబ్ తహసీల్దార్ రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.



కాటారం: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సమ్మయ్య

సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు

పలిమెల : వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులకు ముందస్తు జాగ్రత్తల కోసం గ్రామాల్లో ముమ్మరంగా శానిటేషన్ పనులు చేయాలని, వైద్య ఆరోగ్య సిబ్బంది ఫీవర్ సర్వే నిర్వహించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో వరదలు, సీజనల్ వ్యాధుల నివారణ గురించి మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే వరదల వల్ల ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ హేమ, ఎంపీఓ ప్రకాష్‌రెడ్డి, ఎస్సై తమాషారెడ్డి, ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్, మెడికల్ ఆఫీసర్ రఘురాం, అగ్రికల్చర్ ఆఫీసర్ మహేష్, ఏఈపీఆర్ రవీందర్, ఏపీఎం రవికుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివరాణి, ఐబీఏఈ గణేష్, పంచాయతీ కార్యదర్శులు, స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



పలిమెల : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్

ఐఎన్‌టీయూసీ చొరవతోనే వయో పరిమితి పెంపు

భూపాలపల్లి అర్బన్: సింగరేణిలో కారుణ్య నియామకాల వయో పరిమితి పెంపు ఐఎన్‌టీయూసీతోనే జరిగిందని ఐఎన్‌టీయూసీ ఏరియా బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జోగు బుచ్చయ్య తెలిపారు. ఏరియాలోని కేటీకే 1వ గనిలో బుధవారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌కు బుచ్చయ్య హాజరై మాట్లాడారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి జనక్‌ప్రసాద్ కృషి, కాంగ్రెస్ ప్రభుత్వం చొరవతోనే 35 నుంచి 40 ఏళ్లకు పెంచడం జరిగిందన్నారు. కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు అర్హత కలిగిన ప్రతి కార్మికుడికి 250గజాల సొంతింటి స్థలం, 35శాతం లాభాల వాటా ఇవ్వాలని యూనియన్ నాయకులు సీఎం దీని ఇటీవల కలిసినట్లు తెలిపారు. సింగరేణి బొగ్గుతో పాటు ఖనిజాల ఉత్పత్తి చేపట్టాలని కోరడం జరిగిందన్నారు. కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి సింగరేణి ప్రైవేటీకరణకు అడుగులు వేయడం సిగ్గు చేటుగా ఉందని, ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, వేణుగోపాల్, శ్రీనివాస్, కృష్ణ, రాజేష్, సమ్మయ్య, సమ్మిరెడ్డి, రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న జోగు బుచ్చయ్య

మాంటిస్సోరి స్కూల్‌లో పుస్తకాలు సీజ్

కాటారం: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మండల కేంద్రంలోని మాంటిస్సోరి స్కూల్‌లో విక్రయిస్తున్న పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్‌లను బుధవారం ఆర్‌ఐ వెంకన్న సీజ్ చేశారు. అనుమతులు లేకుండా పుస్తకాలు విక్రయిస్తున్నారని ఎస్ఎఫ్ఐ, డీవైఎస్ఎఫ్ నాయకులు మండల విద్యాధికారికి ఫిర్యాదు చేశారు. ఆర్ఐ వెంకన్న, ఎంఐఎస్ కోఆర్డినేటర్ సుదర్శన్ పాఠశాలను సందర్శించి పుస్తకాలు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. నిల్వ చేసిన పుస్తకాలను సీజ్ చేసి స్థానిక ఎంఈఓ కార్యాలయానికి తరలించారు. అనంతరం విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. పాఠశాల అనుమతి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు స్మరన్, డీవైఎస్ఎఫ్ నాయకుడు ఆతుకూరి శ్రీకాంత్, మండల కమిటీ సభ్యులు తరుణ్, సాగర్, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

పత్తి విత్తనాలు విత్తుకోవాలి

మల్హర్: ఆశించిన మేర వర్షపాతం నమోదు అయినందును రైతులు పత్తి విత్తనాలు విత్తుకోవాలని మహదేవపూర్ ఏడీఏ శ్రీనివాసరాజు సూచించారు. మండలంలోని అన్సాన్‌పల్లి, నాచారం గ్రామాల్లోని పత్తి చేన్లను బుధవారం ఏడీఏ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పత్తిని అధిక సాంద్రత పద్ధతిలో విత్తుకోవడం వలన మొక్కల సంఖ్య పెరిగి అధిక దిగుబడి పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో సాంకేతిక వ్యవసాయ అధికారి ముంజ మహేష్, ఏఈఓ మనీషా, రైతులు పాల్గొన్నారు.



పత్తి చేలో పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీనివాసరాజు

నేడు జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం

రేగొండ: జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం ఈ నెల 20(నేడు)న జరుగుతుందని దానిని విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి హిమబిందు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ఆమె మాట్లాడారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్ల వద్ద నిర్వహిస్తామన్నారు. అలాగే వర్షాకాలంలో సంభవించే వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పున్నం లక్ష్మి, మండల ప్రత్యేకాధికారి శామ్యూల్, తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, ఎంపీఓ రాంప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ హిమబిందు

హోంగార్డుల సమస్యలు పరిష్కరించాలి

భూపాలపల్లి అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా హోంగార్డులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. హోంగార్డుల సంక్షేమ సంఘం రాష్ట్ర చైర్మన్, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌కు బుధవారం హోంగార్డుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల అశోక్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని మొత్తం ఓడీ హోంగార్డుల సంఖ్యలను పరిగణలోకి తీసుకొని వారికి రెగ్యులర్ డ్యూటీలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. మరణించిన హోంగార్డు కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల కింద అవకాశం కల్పించాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, ముఖ్యమంత్రిని కలిసి తమ సమస్యలను పరిష్కరించుకునే విధంగా అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కుమారస్వామి, హనుమంతరెడ్డి, రాజేంద్రప్రసాద్, గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న హోంగార్డులు

ఆదివాసీలకు ఇంటి స్థలాలు కేటాయించాలి

వెంకటాపురం(కె): గోదావరి వరద ముంపునకు గురవుతున్న ఆదివాసీలకు ప్రభుత్వం ఇంటి స్థలాలు కేటాయించాలని ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కోర్సా నర్సింహమూర్తి అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మండల ప్రత్యేకాధికారి స్వర్ణలత, తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఎంపీఓ హనుమంతరావులకు ఆదివాసీల సమస్యలపై నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం వర్షాకాలం సీజన్‌లో గోదావరి వరదకు యాకన్నగూడెం ముంపునకు గురవుతుందన్నారు. వరదలు తగ్గుముఖం పట్టే వరకు గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో నివాసం ఉండాల్సి వస్తుందని వాపోయారు. వరద నీరు ఇళ్లలోకి రావడం మూలంగా పాములు, తేళ్లు ఇళ్లలోకి వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు వరద ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి ఇంటి స్థలాలు కేటాయించాలని పాల్గొన్నారు.

డబుల్ రోడ్డు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న డీఈ రమేష్

మల్హర్: మండలంలోని రుద్రారం గ్రామంలో చేపడుతున్న డబుల్ రోడ్డు పనులను ఆర్‌అండ్‌బీ డీఈ రమేశ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ.. రూ.20కోట్లతో ఐస్వాపూర్ నుంచి రుద్రారం వరకు 6 కిలోమీటర్ల మేర డబుల్ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, పనులు వేగంగా చేపట్టాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

ముగిసిన బీరప్ప ఉత్సవాలు



పూజలో పాల్గొన్న భక్తులు

మహాముత్తారం: మండలంలోని ములుగుపల్లి గ్రామంలో గత వారం రోజులుగా గొల్ల కురుమల ఆధ్వర్యంలో నిర్వహించిన బీరప్ప ఉత్సవాలు బుధవారంతో ముగిసాయి. చివరి రోజు బోనాలతో పాటు కళ్యాణం నిర్వహిస్తూ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బడిబాట ముగింపు

గోవిందరావుపేట: బడి బాట ముగింపు సందర్భంగా మండలంలోని పాఠశాలల ఆధ్వర్యంలో ఎంఈఓ గొంది దివాకర్, నోడల్ అధికారి సోమారెడ్డి ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దివాకర్ మాట్లాడుతూ పాఠశాలలో తరగతులు ప్రారంభమయ్యాయని తెలిపారు. బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని అన్నారు. ప్రభుత్వం అన్ని రకాల వసతులు కల్పిస్తుందని అన్నారు.

మూడు గంటలు నరకయాతన

- ఆస్పత్రి ఎదుట గ్రిల్స్‌లో ఇరుక్కున్న కాలు
- వెల్డర్ సాయంతో గ్రిల్స్ తొలగించి మహిళను రక్షించిన పోలీసులు

రేగొండ: వైద్యం కోసం వచ్చి ఓ మహిళ ప్రమాదంలో పడిన ఘటన మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని గూడెపల్లి గ్రామానికి చెందిన ధరంసోతు వనమ్మ వైద్యం కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చింది. అప్పటికి హాస్పిటల్‌లో సిబ్బంది ఎవరూ లేకపోవడంతో తిరిగి వెళ్తున్న క్రమంలో గేటు వద్ద ఉన్న ఫుట్‌పాత్ గ్రిల్స్‌లో మహిళ కాలు ఇరుక్కుంది. గంటపాటు ప్రయత్నం చేసినప్పటికీ రాకపోవడంతో స్థానికుల సమాచారం మేరకు ఎస్సై రవికుమార్ చేరుకుని వెల్డర్ సాయంతో మహిళా కాలు బయటకు తీశారు. కాలు గ్రిల్స్‌లో ఇరుక్కోవడంతో ఆ మహిళ సుమారు మూడు గంటలపాటు విలవిలలాడుతూ నరకయాతన అనుభవించింది.



గ్రిల్స్ కట్ చేస్తున్న వెల్డర్

వంతెనకు మరమ్మతులు చేపట్టాలి

మల్హర్: ఆరెవాగు వంతెనకు మరమ్మతులు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ, జెన్‌కో అధికారులను కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు దండు రమేశ్ కోరారు. మండలంలోని మల్లారం గ్రామ పంచాయతీ పరిధిలోని దబ్బగట్టు శివారులో ఉన్న ఆరెవాగు వంతెనను ఆర్‌అండ్‌బీ ఏఈ అవినాష్‌తో కలిసి బుధవారం రమేశ్ పరిశీలించి, మాట్లాడారు. ఆరెవాగు వంతెనపై బొగ్గు లారీలు, ఇసుక లారీలు, భారీ వెహికల్స్ నడవడం వలన గుంతలు ఏర్పడి, ఇనుప చువ్వలు తేలి బ్రిడ్జి కూలిపోయే స్థితిలో ఉందని తెలిపారు. యుద్ధప్రాతిపదికన బ్రిడ్జి మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు వ్యక్తిగత సహాయకుడు కొక్కు ప్రవీణ్, కాంగ్రెస్ పార్టీ యూత్ జిల్లా కార్యదర్శి మండల రాహుల్, మండల యూత్ అధ్యక్షుడు గడ్డం క్రాంతి, నాయకులు రూపేశ్‌రావు, మురళి, ఏఎమ్మార్ సీపీఆర్ఓ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌అండ్‌బీ అధికారితో కలిసి వంతెనను పరిశీలిస్తున్న రమేశ్

వరదలకు ముందే నష్ట నివారణ చేపట్టండి

- మండల ప్రత్యేక అధికారి శామ్యూల్

రేగొండ: వర్షకాలం మొదలైన తరుణంలో వరదల కారణంగా నష్టం వాటిల్లకుండా తగిన చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి శామ్యూల్ అన్నారు. బుధవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ పున్నం లక్ష్మి అధ్యక్షతన వర్షకాలంలో వచ్చే వరదలు, సీజనల్ వ్యాధులపై మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శామ్యూల్ మాట్లాడుతూ.. వర్షాలకు శిథిలమై కూలిపోయే ఇళ్లను ముందస్తుగా గుర్తించి తొలగించాలన్నారు. వాతావరణంలో మార్పులతో సీజన్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. తాగునీరు సమస్య తలెత్తకుండా చూడాలని, లీకేజీల ద్వారా నీరు కలుషితం కాకుండా నీటి సరఫరా పైపులకు మరమ్మతులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సత్యనారాయణ స్వామి, ఎంపీడీఓ వెంకటేశ్వర్ రావు, మండల వ్యవసాయ అధికారి వాసుదేవ రెడ్డి, మండల వైద్యాధికారి హిమబిందు, మండల పశువైద్యాధికారి మైథిలీ, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ సౌజన్య, పీఆర్ ఏఈ సతీష్, ఎంపీఓ రాంప్రసాద రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శామ్యూల్

రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



భూపాలపల్లిరూరల్: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



చిట్యాల:కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

- పాల్గొన్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లిరూరల్/చిట్యాల/టేకుమట్ల: కాంగ్రెస్‌పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా భూపాలపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు దేవన్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. వేడుకలకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. చిట్యాలలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గూట్ల తిరుపతి, ప్రధాన కార్యదర్శి గడ్డం కొంరయ్య, మండల కో–ఆప్షన్ సభ్యుడు రాజ్‌మహ్మద్, దబ్బెట రమేష్, దొడ్డి కిష్టయ్య, కుమార్, బుర్ర లక్ష్మణ్ పాల్గొన్నారు. టేకుమట్లలో కోటగిరి సతీష్‌గౌడ్, వైనాల రవీందర్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

సికిల్ సెల్ వ్యాధిని నిర్మూలించాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

భూపాలపల్లి అర్బన్: సరైన అవగాహనతోనే సికిల్ సెల్ వ్యాధిని నిర్మూలించవచ్చని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సికిల్ సెల్ ఎలిమినేషన్ మిషన్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరై మాట్లాడారు. ప్రజల్లో సికిల్ సెల్ వ్యాధిపై సరైన అవగాహన లేక, గుర్తించడంలో ఆలస్యం జరగడం వల్ల అనేకమంది ఈ వ్యాధి బారిన పడుతున్నారని తెలిపారు. బాధితులు వ్యాధిపై సరైన అవగాహన కలిగి ఉండాలని అన్నారు. సికిల్ సెల్ వ్యాధి నిర్మూలనకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. వ్యాధి లక్షణాలు ఉన్న వారికి రక్తహీనత, కామెర్లు ఉండటం, కీళ్ల, ఛాతీ, నడుము దగ్గర తీవ్రమైన నొప్పులు ఏర్పడతాయని, చేతులు, కాళ్లు వాపు రావడం వంటి లక్షణాలు ఉంటాయని డీఎంహెచ్ఓ డాక్టర్ మధుసూదన్ తెలిపారు. దీనిపై విద్యార్థులకు జిల్లా వ్యాప్తంగా పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణిసిద్ధు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ కొమురయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



భూపాలపల్లి అర్బన్: సికిల్ సెల్ పరీక్షలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

అవగాహన సదస్సు

రేగొండ: నేషనల్ సికిల్ సెల్ అనిమియా ఎలిమినేషన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతి బాపూలే పాఠశాలలో విద్యార్థులకు సికిల్ సెల్ అనిమియా నిర్మూలనకై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి హిమబిందు మాట్లాడారు. సికిల్ సెల్ అనేది వంశపారం పర్యమైన రుగ్మత అన్నారు. అలాగే ఎనిమియా వ్యాధి లక్షణాలు, వ్యాపించే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో జెడ్పీఎస్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు కృష్ణకుమారి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై సమీక్ష సమావేశం

టేకుమట్ల : మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి అధ్యక్షతన వర్షకాలంలో వచ్చే వరదలు, సీజనల్ వ్యాధులపై మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోతట్టు ప్రాంతాలను గుర్తించి వరదలకు మునిగిపోకుండా చర్యలు చేపట్టాలన్నారు. సీజన్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్న నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పులి తిరుపతి రెడ్డి, తహసీల్దారు విజయలక్ష్మి, ఎంపీడీఓ అనిత, మండల వైద్యాధికారి ఆశాజ్యోతి, మండల పశువైద్యాధికారి మైథిలీ, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ హరీశ్, పీఆర్ ఏఈ రాజయ్య, ఎలక్ట్రికల్ ఏఈ మణిదీప్, ఎంపీఓ సురేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఓ సురేష్